## కాంగ్రెస్‌లో..

ఇంకా పెండింగులోనే గ్రేటర్‌లోని కీలకమైన నియోజకవర్గాలు

నివురుగప్పిన నిప్పులా.. తొమ్మిది నియోజకవర్గాలు

# సీటు.. నోటు.. హీటు




గాంధీ భవన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): తొలి అడుగులోనే అగ్గి రాజుకున్న కాంగ్రెస్‌కు ముందుంది ముసుర్ల పండుగ అని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. తొలి జాబితాలో గ్రేటర్ పరిధిలోని పద్నాలుగు నియోజకవర్గాల్లో దాదాపు అన్ని స్థానాల్లోనూ అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. ఇందులో మేడ్చల్, ఉప్పల్ స్థానాలతో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పెండింగులో పెట్టిన మిగిలిన పది స్థానాల్లో తొమ్మిది చోట్ల అదే పరిస్థితి. నివురుగప్పిన నిప్పులా ఉండటంతోనే ఈ నియోజకవర్గాలను పెండింగ్‌లో పెట్టినట్లుగా స్పష్టమవుతోంది. దీంతో పాటు సీటుకు నోటు తెరపైకి వచ్చిన మహేశ్వరం కూడా పెండింగులోనే ఉండగా.. ఇప్పటికే వెల్లడైన తొలి జాబితాలోనూ సీటుకు నోటు ఆరోపణలు వెల్లువెత్తిన స్థానాలు కొత్తగా బయటికి రావడం గమనార్హం.

గ్రేటర్ హైదరాబాద్‌లో మేడ్చల్ సహా 24 నియోజకవర్గాలుండగా.. ఇందులో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌కి సరైన అభ్యర్థులే కరువయ్యారు. పార్టీ అధిష్ఠానం దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ద్వితీయ శ్రేణి నాయకులు, ఇతరులు రేసులోకి వచ్చారు. ఈ నేపథ్యంలో ఉన్న వారిలో ఏ ఒక్కరికీ టికెట్ దక్కినా మిగిలిన వారు భగ్గుమంటున్నారు. ముఖ్యంగా సీటుకు నోటు వ్యవహారం తెరపైకి రావడంతో టికెట్ల కొనుగోలు పెద్ద ఎత్తున జరిగిందనే అనుమానాలు ప్రతి నియోజకవర్గంలోని నేతల్లో ఉంది. దీనికి తోడు రాత్రికి రాత్రి పార్టీలోకి వచ్చిన వారు, జూనియర్లు రేసులో ముందుండటంతో నిజంగా పార్టీ కోసం శ్రమించిన వారిలోని అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నది. ఈ నేపథ్యంలో తొలి జాబితాలో ఉన్న ఉప్పల్, మేడ్చల్‌తో పాటు పాతబస్తీలోని నియోజకవర్గాల టికెట్ల కేటాయింపుల్లోనూ సీటుకు నోటు వ్యవహారం దాగి ఉన్నదని ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన రాగిడి లక్ష్మారెడ్డి ఈ విషయం బహిరంగ పరిచారు. గతంలోనే రేవంత్‌రెడ్డి తనను డబ్బులు అడిగారని, ఇవ్వనందుకే అది మనసులో పెట్టుకొని వేరొకరికి టికెట్ ఇచ్చారని ఆరోపించారు. అందునా.. ఇది చీకటి ఒప్పందంలో భాగమేనని కుండబద్దలు కొట్టారు. మేడ్చల్‌లోనూ ఇదే ఆరోపణ వినిపించింది.

### అసమ్మతి నియోజకవర్గాలివే..

- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి టికెట్ రేసులో ఉన్నారు. కానీ, అనూహ్యంగా మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ప్యారాచూట్ నేత నియోజకవర్గంలోకి రావడంతో కలకలం రేగింది. ఇక్కడ ఎవరికీ టికెట్ ఇచ్చినా.. మరొకరు తిరుగుబావుటా ఎగురవేస్తారనేది అధిష్ఠానంలో ఉన్న ఆందోళన.
- ఖైరతాబాద్‌లో రేవంత్ అనుచరుడు రోహిన్‌రెడ్డికే టికెట్ దక్కుతుందని ఆయన వర్గం బహిరంగంగా చెబుతోంది. ఇక్కడ కూడా పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆమెకు టికెట్ రాకుండా రేవంత్ చెక్ పెడుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో ఇక్కడా ప్రకటన వెలువడగానే అసమ్మతి పెద్ద ఎత్తున ఎగిసిపడనున్నది.
- కూకట్‌పల్లిలో ఆశావహుల సంఖ్య బాగానే ఉంది. ఇక్కడ టికెట్ కోసం శ్రీరంగ సత్యం, గొట్టిముక్కల పద్మారావు, వెంగళరావు, ఇలా అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఏ ఒక్కరికీ వచ్చినా మిగిలిన వారు తిరుగుబావుటా ఎగరవేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తున్నది.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రఘునాథ్‌యాదవ్, జగదీశ్‌గౌడ్‌తో పాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ టికెట్ కోసం పెద్ద ఎత్తున రేవంత్‌కు డబ్బులు ముట్టాయనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఈ నేపథ్యంలో టికెట్ ఖరారు కాగానే.. ఈ వ్యవహారానికి సంబంధించిన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ టికెట్ కోసం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్, గౌరీ సతీష్‌తో కేఎల్ఆర్ కూడా కన్నేసినట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఇక్కడ టికెట్ ఖరారుతోనే మిగిలిన వారు ఒక్కసారిగా భగ్గుమని, వీధుల్లోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.
- ఎల్బీనగర్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

### తొలి జాబితాతో మరిన్నిచోట్ల వెలుగులోకి సీటుకు నోటు వ్యవహారం

ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ దరఖాస్తు చేసుకోగా... ఆయనకు చెక్ పెట్టేందుకు రేవంత్‌రెడ్డి రాత్రికి రాత్రి కండువా కప్పి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్‌ను రంగంలోకి దింపారు. దీంతో పాటు ఇక్కడి నుంచి స్థానిక నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి వంటి వారు కూడా టికెట్ ఆశిస్తున్నారు. స్థానికేతరుడికి టికెట్ ఇచ్చినా, ప్యారాచూట్ నేతకు అవకాశం ఇచ్చినా.. సహించేది లేదని స్థానిక నేతలు అల్టిమేటం జారీ చేశారు.

- మహేశ్వరం వేదికగానే సీటుకు నోటు తెరపైకి వచ్చింది. ఇక్కడ టికెట్ కోసం ఏకంగా ఐదెకరాలు, రూ.15 కోట్లు రేవంత్‌కు ఇచ్చినట్లుగా ఆ పార్టీ నేతలే బహిరంగపరిచారు. ఇదే సమయంలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సహా ఐదుగురు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, పెద్ద ఎత్తున చేతులు మారడంతో ఆ దిశగానే టికెట్ కేటాయింపు జరుగుతుందని ఆ పార్టీ నేతలే వాపోతున్నారు.
- కంటోన్మెంట్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోనూ అసమ్మతి నేతలు పొంచి ఉన్నారు. ముఖ్యంగా అంబర్‌పేటలో సీనియర్ నేత వీహెచ్ తన అనుచరుడికి ఇప్పించుకోవాలని చూస్తుండగా, తాజా, మాజీ పీసీసీ అధ్యక్షులు రేవంత్, ఉత్తమ్ కూడా తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీంతో ఇక్కడ సీటు కేటాయింపు అనేది రాష్ట్ర నేతల మధ్యనే కుంపట్లు రాజేయనున్నట్లు స్పష్టమవుతుంది.
- ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో టికెట్ పంచాయితీ రాజుకుంటుంది. నియోజకవర్గానికి సంబంధం లేని స్థానికేతరులకు టికెట్ ఇవ్వడమేంటని ఆ పార్టీ సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు కాంగ్రెస్ అధిష్ఠానానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌కు కేటాయించినట్లు ప్రకటన విడుదల కాగానే.. స్థానికంగా వ్యతిరేకత మొదలైంది. టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేశ్ ముదిరాజ్ ఆ పార్టీ అధిష్ఠానం తీరుపై సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు.

### నగరంలో 14 మందికి.. కాంగ్రెస్ టికెట్లు ఖరారు

సిటీబ్యూరో, అక్టోబర్ 15 ( నమస్తే తెలంగాణ ) : మహానగరంలో కాంగ్రెస్ పార్టీ 14 మందికి టికెట్లు ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ఆదివారం 14 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తూ ప్రకటించింది. అందులో మేడ్చల్- తోటకూర వజ్రేశ్ యాదవ్, మల్కాజిగిరి- మైనంపల్లి హనుమంత రావు, కుత్బుల్లాపూర్- కొలను హన్మంత్ రెడ్డి, ఉప్పల్- ఎం.పరమేశ్వర్ రెడ్డి, ముషీరాబాద్-అంజన్ కుమార్ యాదవ్, మలక్‌పేట- షేక్ అక్బర్, సనత్‌నగర్- డాక్టర్ కోట నీలిమ, నాంపల్లి- మహ్మద్ ఫిరోజ్ ఖాన్, కార్వాన్ – ఒస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజ్రీ, గోషామహల్- మొగిలి సునీత, చాంద్రాయణగుట్ట- బోయ నగేశ్ (నరేశ్), యాకుత్‌పుర- కె.రవి రాజు, బహదూర్‌పుర- రాజేశ్ కుమార్ పులిపాటి, సికింద్రాబాద్- ఆదం సంతోష్ కుమార్ ఉన్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో 55 మందితో అభ్యర్థుల జాబితాను హస్తం పార్టీ ప్రకటించింది.

## నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- సిటీ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య



సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య సిబ్బందికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం సౌత్‌జోన్, సౌత్‌ఈస్ట్, ఈస్ట్‌సౌత్, సౌత్ వెస్ట్, సెంట్రల్ జోన్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ విభాగాలకు చెందిన ఆయన డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సీపీ సమీక్షలు నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై సిబ్బందితో ఆయన చర్చించారు. ఏ, బీ, సీ కేటగిరి పోలీస్‌స్టేషన్లు, ఆయా ఠాణాలకు మంజూరైన సిబ్బంది సంఖ్య, ఎన్నికల విధుల్లో ఎంత మంది పాల్గొంటున్నారు.. వారి విధులు తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నగదు, లిక్కర్, డ్రగ్స్, బంగారం, వెండి ఆభరణాలతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలించే ఇతర వస్తువులు ఎంత వరకు పట్టుకున్నారు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్కడక్కెడ చేపడుతున్నారని ఆరా తీశారు. నాన్‌బెయిలబుల్ వారెంట్ల ఎగ్జిక్యూషన్, బైండోవర్, ఆయుధాల డిపాజిట్, అసాంఘిక శక్తులపై తీసుకుంటున్న చర్యలు, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని, శాంతి భద్రలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌ను ప్రతి ఒక్కరూ అమలు చేయాలని, సిబ్బందికి ఉన్న సందేహాలను సీపీ నివృత్తి చేశారు. గత 15 రోజుల్లో పనితీరుపై టాస్క్‌ఫోర్స్ నుంచి రివ్యూ తీసుకున్నారు. నగర కమిషనరేట్ పరిధిలోని 15 నియోజకవర్గాలకు 90 ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను కేటాయించి వారి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్‌మాన్, అదనపు సీపీ(ఎస్బీ) విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.51 లక్షల నగదు, మద్యం స్వాధీనం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 15: రాయదుర్గం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.51 లక్షల నగదు, లక్ష విలువైన మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఖాజాగూడ జంక్షన్ వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51 లక్షలు నగదు, లక్షల విలువజేసే మద్యం బాటిళ్లను వాహనదారులు నుంచి స్వాధీనం చేసుకున్నారు.

### కారులో తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టివేత..

బంజారాహిల్స్, అక్టోబర్ 15: జూబ్లీహిల్స్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఎన్నికల సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఓ కారులో పరిశీలించగా.. 38 మద్యం బాటిళ్లు లభించాయి. కారు నడిపిస్తున్న మేడపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

## జేబులో దాచుకొని తెస్తున్న బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 15 : ప్యాంట్ జేబులో దాచుకొని బంగారం తరలిస్తున్న వ్యక్తిని కస్టమ్స్ అధికారులు ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో పట్టుకున్నారు. కస్టమ్స్ అధికారుల కథనం ప్రకారం.. కువైట్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిపై కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చి, తనిఖీ చేశారు. ప్రయాణికుడు తన ప్యాంట్ జేబులో దాచుకొని తరలిస్తున్న 656 గ్రాముల బంగారాన్ని గుర్తించిన కస్టమ్స్ అధికారులు సీజ్ చేశారు. పట్టుబడిన బంగారం విలువ రూ.40.41 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## మరో జైత్రయాత్రకు శ్రీకారం

- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం షురూ
- యూసుఫ్‌గూడలో ఎమ్మెల్యే మాగంటి ఇంటింటి ప్రచారం

బంజారాహిల్స్, అక్టోబర్ 15: 'ఇక మొదలెడదామా..' అంటూ ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసురుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరనే అంశంపై స్పష్టత రాకముందే.. బీఆర్ఎస్ మాత్రం ఎన్నికల శంఖారావం పూరించింది. యూసుఫ్‌గూడ డివిజన్‌లోని శ్రీ కృష్ణానగర్ ఏ-బ్లాక్‌లో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శ్రీ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాగంటి గోపీనాథ్ ఇంటింటి ప్రచారానికి శ్రీకారం



శ్రీకృష్ణానగర్ ఏ-బ్లాక్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాగంటి గోపీనాథ్‌కు హారతులు ఇస్తున్న మహిళలు

చుట్టారు. మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అందజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎల్ఎన్‌నగర్, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్, వార్డు సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌కు మహిళలే అండదండ..

బీఆర్ఎస్ పార్టీకి మహిళలే అండదండ అని మాగంటి గోపీనాథ్ అన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఎక్కువ భాగం మహిళలకే ప్రయోజనం కలిగించాయన్నారు. మహిళల గుండెల్లో సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలో సైతం మహిళలకు పెద్దపీట వేశారని, అర్హులైన వారికి సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలందరూ బీఆర్ఎస్‌కు ఓటువేసి ఘన విజయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.